సాక్షి ఒడిశా

శుక్రవారం । 23 । ఆగస్టు । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3.21.448లు, బంగారం 50 మిల్లీ గ్రాములు, వెండి 179గ్రాముల 900 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



కల్తీ సారాకు మరొకరు బలి

గంజాం జిల్లా చికిటి మండలం జెనాపూర్ గ్రామంలో కల్తీ సారా మహమ్మారి రెండు నిండు ప్రాణాలను బలిగొంది. దీంతో గ్రామస్తుల్లో ఆందోళన నెలకొంది.

- 8లో




జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీజేడీ హవా

జిల్లా పరిషత్ ఎన్నికల్లో బిజు జనతా దళ్ సత్తాచాటింది. పలువురు అభ్యర్థులు గెలుపొందడంతో నవీన్ నివాస్ గురువారం కళకళలాడింది.

- 8లో

న్యూస్‌రీల్

సెజ్ మృతులకు నవీన్ సంతాపం



నవీన్ సందేశం

కొరాపుట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ మృతులకు మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గురువారం ఎక్స్(ట్విటర్) వేదికగా సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబాలు ధైర్యంగా ఉండాలన్నారు. ఫార్మా కంపెనీలో ప్రమాదం జరిగి 18 మంది కార్మికులు మృతి చెందిన విషయం తెలిసిందే.

విజిలెన్స్ వలలో టెక్నికల్ అసిస్టెంట్

భువనేశ్వర్: ఝార్సుగుడ జిల్లా ప్రధాన వ్యవసాయాధికారి కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గణేష్ కల్సేర్ గురువారం విజిలెన్స్ వలకు చిక్కాడు. కాంట్రాక్టు ఉద్యోగాన్ని కొనసాగించేందుకు ఫైల్ ప్రాసెస్ చేసేందుకు ల్యాబొరేటరీ అటెండెంట్ నుంచి రూ.50,000 లంచం తీసుకుంటుండగా ఒడిశా విజిలెన్స్ అధికారులకు పట్టుబడ్డాడు.

మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలి



నిరసన తెలియజేస్తున్న ట్రాన్స్‌జెండర్లు

పర్లాకిమిడి: కోల్‌కోతాలో వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ ట్రాన్స్‌జెండర్లు గురువారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో తృతీయ లింగ సంఘటన్ సభ్యులు మధు, సంగీత, ప్రగతి మహిళా సంఘటన్ కార్యదర్శి తనూజా శతపథి తదితరులు పాల్గొన్నారు.

సారా పట్టివేత

జయపురం : కుంద్ర సమితి లిమ్మ గ్రామ ప్రాంతంలో సారా తరలిస్తున్న నబీన్ బిశాయిని పోలీసులు గురువారం పట్టుకున్నారు. రబ్బరు ట్యూబ్‌ల్లో ఉన్న 32 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు క్వింటాళ్ల చేపలు మృత్యువాత



చెరువులో తేలిన చేపలు

మల్కన్‌గిరి: కోరుకొండ సమితి కంబేడ పంచాయతీ యంవీ 29 గ్రామంలో చెరువులో సుమారు ఆరు క్వింటాళ్ల చేపలు మృత్యువాతపడ్డాయి. ఈ ఘటనలో సుమారు రూ.75 వేలు నష్టం వాటిల్లింది. చేపల మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. జిల్లా మత్స్యశాఖ అధికారులు తక్షణమే దర్యాప్తు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు

వికటించిన మధ్యాహ్న భోజనం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

కొరాపుట్: జిల్లాలోని దశమంతపూర్ సమితి గిర్లిగుమ్మ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనం తిని 15 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఒక్కసారిగా వాంతులు, కడుపు నొప్పి వంటి సమస్యలు రావడంతో వెంటనే స్థానిక వైద్యుడిని రప్పించి చికిత్స అందించారు. అయినా ఫలితం లేకపోవడంతో దశమంతపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. ఇప్పటికే కొరాపుట్ జిల్లా ఆశ్రమ పాఠశాలలో అధ్వాన పరిస్థితులపై లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత ఉద్యమం చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా మరో ఘటన చోటుచేసుకోవడంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో పరిస్థితులపై సమీక్ష చేస్తామన్నారు. నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

మృత్యు శకటం



టీ దుకాణంలోకి దూసుకెళ్లిన వాహనాలు (ఇన్‌సెట్లో) ఘటనా స్థలంలో నుజ్జయిన వాహనాలు



సమయం..

గురువారం ఉదయం 5.30 గంటలు

ప్రదేశం..

గంజాం జిల్లా సమరజ్‌హోల్ జంక్షన్‌లో ఓ టీకొట్టు..

ఏం జరిగిందంటే

టీ షాపులో కొందరు మాట్లాడుతూ టీ తాగుతున్నారు. ఇంతలో ఒక్కసారిగా బస్సు, ట్యాంకర్ షాపులోకి దూసుకొచ్చాయి. ఏం జరిగిందో తెలుసుకునేలోపే టీ తాగుతున్న ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మరో వ్యక్తి వాహనంలోనే ఛిద్రమయ్యాడు. 12 మంది తీవ్ర గాయాలతో మృత్యువుతో పోరాడుతున్నారు.

- గంజాం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- బస్సు, ట్రక్కులను ఢీకొట్టిన ట్యాంకర్
- టీకొట్టులోకి దూసుకెళ్లిన వాహనాలు
- నలుగురు మృతి.. 12 మందికి తీవ్ర గాయాలు
- రూ.2లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సీఎం

కొరాపుట్ : అతివేగానికి అమాయకులు బలైపోయారు. ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. టీ తాగుతున్న వారిపైకి వాహనాలు దూసుకెళ్లడంతో నలుగురు మృత్యువాతపడ్డారు. మరో 12 మంది మృత్యువుతో పోరాడుతున్నారు. ఈ విషాదకర ఘటన గంజాం జిల్లా సమరజ్‌హోల్ జంక్షన్‌లో గురువారం ఉదయం చోటుచేసుకుంది. అతివేగంతో వస్తున్న ఓ ట్యాంకర్ ఆగి ఉన్న ట్రక్‌ను ఢీకొట్టి వెనువెంటనే ఎదురుగా వస్తున్న ప్రయాణికుల బస్సును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓడీ 07 ఎస్ 9181 నంబర్ గల ప్రయివేటు బస్సు (కంబేశ్వరి) అస్కా నుంచి బ్రహ్మపుర వైపు బయలుదేరింది. అదే సమయంలో ఓ ట్యాంకర్ బ్రహ్మపుర నుంచి అస్కా వైపు వస్తోంది. ఈ రెండు పరస్పరం ఎదురుగా వచ్చేసరికే సమరజ్‌హోల్ జంక్షన్ వద్ద ఓ టీ షాపు వద్ద ట్రక్ ఆగి ఉంది. సుమారు వంద కిలోమీటర్ల వేగంతో ట్యాంకర్ తొలుత ఆగి ఉన్న ట్రక్‌ను ఢీకొట్టింది. వెనువెంటనే ఎదురుగా వస్తున్న బస్సును సైతం ఢీకొట్టింది. దీంతో బస్సు, ట్యాంకర్‌లు ఎదురుగా ఉన్న టీ షాపు లోపలికి చొచ్చుకుపోయాయి. ఈ ఘటనలో కటక్ చౌద్వార్‌కు చెందిన ట్రక్ డ్రైవర్ ఇంద్రజిత్ స్వయ్ (26), టీషాపులో ఉన్న సమరజ్‌హోల్‌కి చెందిన అరక్షిత గౌడ(65), పంచు గౌడ (61), కురుకుల గ్రామానికి చెందిన సంతృప్త సందేశ్ (52) అక్కడికక్కడే మృతి చెందారు. బస్సులో ఉన్న 12 మందికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే బ్రహ్మపురలోని ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించారు. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది.



విలపిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు..

ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝీ మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రు.లక్ష చొప్పున పరిహారం ప్రకటించారు. ఈ ఘటనపై మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులు వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బిభుతి భూషణ్ జెన్నా, రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు కమిషనర్ అమితాబ్ ఠాకూర్, గంజాం జిల్లా కలెక్టర్ దివ్య జ్యోతి పరిడా ఆస్పత్రిని సందర్శించి క్షతగాత్రులను పరామర్శించారు. నాణ్యమైన వైద్యం అందజేయాలని వైద్య శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.



క్రేన్‌తో సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది



క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి, అధికారులు

ఈడీ కార్యాలయం ముట్టడికి విఫలయత్నం

భువనేశ్వర్: స్థానిక ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయం ముట్టడికి యత్నించిన కాంగ్రెస్ కార్యకర్తలను గురువారం పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తాజా ఆరోపణలపై దేశవ్యాప్త నిరసనలో భాగంగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ప్రదర్శన నిర్వహించారు. ఈడీ కార్యాలయం ముట్టడికి విఫలయత్నం చేశారు. బారికేడ్లను అధిగమించి కార్యాలయం వైపు దూసుకుపోయిన ఆందోళనకారుల్ని అడ్డుకోవడంతో పోలీసులు, కాంగ్రెసు కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసమే ఈడీ, సీబీఐ, ఎన్‌ఐఏ వంటి దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన క్లెయిమ్‌లపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) విచారణకు కాంగ్రెస్,ఇతర ఇండియా బ్లాక్ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.



ఈడీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు, పోలీసుల తోపులాట

జర్నలిస్టుల బీమా పథకం కొనసాగింపు

భువనేశ్వర్: వర్కింగ్ జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య బీమా పథకాన్ని కొనసాగిస్తుందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ గురువారం స్పష్టం చేశారు. శాసనసభలో కాంగ్రెస్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహినీపతి అడిగిన ప్రశ్నకు సీఎం సమాధానం ఇచ్చారు. త్వరలో హెల్త్‌కార్డుల నవీకరణ పూర్తి చేస్తామని చెప్పారు. వర్కింగ్ జర్నలిస్టుల కోసం గోపబంధు సాంబాదిక స్వాస్థ్య బీమా యోజన పునరుద్ధరణ పరిశీలనలో ఉందని, ఆమోదం పొందిన తర్వాత గడువులోపు నవీకరణ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. వాస్తవానికి ఈ బీమా కార్డుల చెల్లుబాటు ఈ నెల 31తో ముగియనుంది. కాగా, గత ప్రభుత్వం ఈ సౌకర్యం స్థానిక పత్రికలకు మాత్రమే పరిమితం చేసింది.

3 ఫ్లాట్లు.. 8 ప్లాట్లు



సోదాల్లో బయటపడిన సొత్తు

- టాయిలెట్ ఫ్లష్‌లో రూ.500 నోట్ల కట్టలు
- రేంజర్ ఇంట్లో వెలుగుచూసిన అక్రమాస్తులు

భువనేశ్వర్: ఢెంకనాల్ సదర్ రేంజర్ బిభుదానంద్ మిశ్రా అక్రమాస్తులపై విజిలెన్సు వర్గాలు గురువారం దాడులు చేపట్టాయి. ఢెంకనాల్, కటక్, భువనేశ్వర్ ప్రాంతాల్లోని సొంత ఇల్లు, ప్రభుత్వ క్వార్టరు, కార్యాలయంలో ఏకకాలంలో సోదాలు నిర్వహించాయి. ఏడుగురు డీఎస్పీలు, ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు, ఆరుగురు సహాయ సబ్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ కమాండెంట్ పాల్గొన్న ఈ దాడుల్లో భారీగా అక్రమాస్తులు వెలుగుచూశాయి.

టాయిలెట్‌లో నల్లధనం..

ఇంటిలోని టాయిలెటు ఫ్లష్‌లో నల్లధనం దాచినట్లు విజిలెన్సు సోదాల్లో గుర్తించారు. ఫ్లష్ నుంచి రూ.500 నోట్ల కట్టలు బయటపడ్డాయి. వీటి మొత్తం రూ.లక్షగా పేర్కొన్నారు. వీటితో పాటు భువనేశ్వర్‌లో ఒక ఫ్లాట్, హైదరాబాద్‌లో 2 ఫ్లాట్లు, భువనేశ్వర్, ఢెంకనాల్ ప్రాంతాల్లో మొత్తం 8 ప్లాట్లు ఉన్నాయి. కటక్ జిల్లా అఠాగాడాలో 5 ఎకరాల ఫామ్‌హౌస్ నిర్మాణ దశలో ఉంది. దీనిలో కోళ్ల ఫారం, నర్సరీ, పార్క్ ఉన్నట్లు గుర్తించారు. సోదాల్లో 300 గ్రాముల బంగారం, ఒక వజ్రం, బ్యాంకు డిపాజిట్‌లో రూ.40 లక్షల రూపాయలు, ఇంట్లో రూ.4 లక్షల నగదును విజిలెన్సు అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



టాయిలెట్ ఫ్లష్‌లో నోట్ల కట్టలు

దేవ్‌గఢ్‌లో బంగారు గని

భువనేశ్వర్: దేవ్‌గఢ్‌లోని అడసా – రామపల్లి ప్రాంతంలో బంగారు గని గుర్తించామని, మరిన్ని బంగారు నిక్షేపాలను అన్వేషించడానికి తనిఖీలు జరుగుతున్నాయని రాష్ట్ర ఉక్కు, గనుల శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా గురువారం రాష్ట్ర శాసనసభలో వెల్లడించారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ఈ ప్రాంతంలో రాగి ఖనిజం కోసం జీ2 స్థాయి తనిఖీ చేస్తుండగా బంగారు గని గుర్తించారని, ఈ బ్లాక్‌ను వేలం వేయడానికి ప్రణాళిక సిద్ధమవుతోందని చెప్పారు. శూన్య గంటలో జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహినీపతి అడిగిన ప్రశ్నకు మంత్రి పైవిధంగా సమాధానమిచ్చారు. 1981–83, 1989–96 కాలంలో కెంజొహర్ జిల్లాలోని గోపూర్ – గాజీపూర్ ప్రాంతంలో బంగారు నిక్షేపాలపై ప్రాథమిక సర్వే నివేదిక ఆధారంగా 2021–22 నుంచి జీఎస్ఐ, డైరెక్టరేట్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ సంయుక్తంగా జీ2 స్థాయి పునఃపరిశీలన చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. బంగారు గని పరిమాణం, నాణ్యత నిర్ణయించని కారణంగా తవ్వకానికి ప్రణాళిక లేదని వివరించారు. దేవ్‌గఢ్‌లోని అడసా – రామపల్లి ప్రాంతం, కెంజొహర్ జిల్లా దిమిరిముండా, కుషాకొలా, గోటిపూర్, గోపూర్, మయూర్‌భంజ్ జిల్లాలో జోషిపూర్, సురియాగూడ, రువాన్‌సిలా, ధుషురా కొండల్లో వేలం ప్రక్రియ జరగకముందే బంగారం నిక్షేపాల పరిమాణం తెలుసుకోవడానికి తాజా సర్వే జరుగుతోందన్నారు. అయితే ఖనిజాల నుంచి బంగారాన్ని వెలికితీసేందుకు ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసే యోచన మాత్రం లేదని మంత్రి తెలిపారు. సుందర్‌గఢ్, నవరంగ్‌పూర్, అంగుల్, కొరాపుట్, మల్కన్‌గిరి, సంబల్‌పూర్, బౌధ్ జిల్లాల్లోని అనేక ప్రదేశాలలో కూడా బంగారు నిక్షేపాలు ఉండే అవకాశం ఉందన్నారు. అయితే, దీనికి అధికారిక ధ్రువీకరణ లేదన్నారు. కాగా, 2023 మార్చిలో అప్పటి ఉక్కు, గనుల శాఖ మంత్రి ప్రఫుల్ల మల్లిక్ దేవ్‌గఢ్, కెంజొహర్, మయూర్‌భంజ్‌తో సహా మూడు జిల్లాల్లో బంగారం నిల్వలు ఉన్నట్లు ప్రకటించారు. కెంజొహర్ జిల్లాలో నాలుగు చోట్ల, మయూర్‌భంజ్ జిల్లాలో నాలుగు చోట్లు, దేవ్‌గఢ్ జిల్లాలో ఒక చోట ఈ బంగారు నిక్షేపాలు కనుగొన్నారు.

అడవిలో వదిలేయండి..



మల్కన్‌గిరి జిల్లా బలిమెల పట్టణంలో ధన్‌పూరియా వీధిలో గురువారం సుమారు 8 అడుగుల కొండచిలువ కలకలం సృష్టించింది. వెంటనే సమాచారం అందుకున్న బలిమెల స్నేక్ హెల్ప్‌లైన్ రాజేంద్ర ఖోర ఘటనా స్థలానికి చేరుకుని చాకచక్యంగా కొండచిలువను పట్టుకుని చిత్రకొండ ఘాట్ రోడ్డులోని అటవీ ప్రాంతంలో వదిలేశారు. పాము కనిపించిన వెంటనే చంపకుండా అటవీ ప్రాంతంలో వదిలేయాలని స్థానికులకు విజ్ఞప్తి చేశారు.

– మల్కన్‌గిరి

దయచేసి వినండి..



కొరాపుట్ వ్యాలీలో కోతులకు ఆహారం పెట్టవద్దని జిల్లా అధికార యంత్రాంగం విజ్ఞప్తి చేస్తోంది. ఈ మేరకు ఘాట్ రోడ్లలో ప్రచార బోర్డులను ఏర్పాటు చేస్తోంది. ప్రయాణికులు విసిరే ఆహారం కోసం వచ్చి వాహనాలు ఢీకొట్టడంతో ఎన్నో వానరాలు మృతిచెందుతున్నాయని, ఇకపై ఎవరూ ఆహారం విసరవద్దంటూ బోర్డుల్లో పేర్కొంటున్నారు.

– కొరాపుట్

జోరు కొనసాగించండి..



ఒడిశా వాసులకు హాకీ క్రీడ మాత్రమే కాదని జీవితంలో అంతర్భాగమని మాజీ సీఎం నవీన్ పట్నాయక్ పేర్కొన్నారు. పారిస్ ఒలింపిక్స్ 2024లో కాంస్య పతకాన్ని గెలిచిన భారత హాకీ జట్టును గురువారం ప్రత్యేకంగా అభినందించారు. విజయాల జోరును కొనసాగించాలని ఆకాంక్షించారు.

– భువనేశ్వర్

క్లుప్తంగా

ఆహార కేంద్రాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారి

పర్లాకిమిడి: స్థానిక కొత్త బస్టాండ్‌లోని అర్బన్ నిరాశ్రయులు, ఆహార కేంద్రాలను పర్లాకిమిడి పురపాలక సంఘం కార్యనిర్వహణ అధికారి గౌరచంద్ర పట్నాయక్ గురువారం తనిఖీ చేశారు. హోంలెస్ కేంద్రంలోని సౌకర్యాలు, భోజన వసతులపై ఆరా తీశారు.

బ్యాటరీల చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

జయపురం: వ్యాన్‌లలో బ్యాటరీలను దొంగిలించిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి గురువారం వెల్లడించారు. అరెస్టయిన వారిలో స్థానిక ఇరిగేషన్ కాలనీకి చెందిన రామచంద్ర గౌరడ, బ్లాక్ కాలనీకి చెందిన శివ ముదులి, వీరి వద్ద బ్యాటరీలో కొనుగోలు చేసిన దుకాణ యజమాని షేక్ రమజాన్ ఉన్నారు. మే 21న జయపురం సమితి డంపింగ్ యార్డు ప్రాంతంలో దేవదర్షన్ దేవర తన ఇంటి ముందు రెండు వ్యాన్లు ఉంచగా ఈ చోరీ జరిగింది.

దోపిడీకి విఫలయత్నం





నరేష్ హరిజన్ సురేష్ హరిజన్

జయపురం: దోపిడీకి ప్రయత్నించిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి గురువారం వెల్లడించారు. అరెస్టయిన వారిలో జయనగర్ దాసరి వీధికి చెందిన నరేష్ హరిజన్, సురేష్ హరిజన్ ఉన్నారని, వారు వినియోగిస్తున్న స్కూటర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో పంపుణి గ్రామానికి చెందిన కైలాస ప్రధాన్ అనే వ్యక్తి కొన్ని సామాన్లతో తన ఇంటికి వెళ్తున్నాడు. జయనగర్–పంపుణీ రహదారిలో ఇద్దరు దుండగులు స్కూటర్‌పై వచ్చి కైలాస్‌ను అడ్డగించి సామాన్లు, మొబైల్ ఫోను ఇవ్వాలని, లేకుంటే చంపుతామని బెదిరించారు. ఇంతలో కైలాస్ కేకలు వేయగా స్థానికులు వచ్చి దుండగులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

ఆక్రమణల తొలగింపునకు సన్నద్ధం

జయపురం: పట్టణంలోని ప్రధాన వ్యాపార కూడలి మహాత్మా గాంధీ రోడ్డులో ఆక్రమణల తొలగింపునకు జయపురం మునిసిపాలిటీ అధికారులు సిద్ధమయ్యారు. గురువారం వెల్కం జంక్షన్ నుంచి గాంధీ జంక్షన్ వరకు కొలతలు నిర్వహించి మార్కింగ్ వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.3వేల పింఛన్ ఎప్పుడిస్తారు?



వృద్ధులకు కరపత్రాలు అందజేస్తున్న ప్రకాష్ చంద్ర మజ్జి

కొరాపుట్: ఎన్నికల హామీ మేరకు భారతీయ జనతా పార్టీ తక్షణమే వృద్ధాప్య పింఛన్ రూ.3వేలు అందజేయాలని బీజేడీకి చెందిన జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్ చంద్ర మజ్జి డిమాండ్ చేశారు. గురువారం నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి, జొరిగాం సమితులలో జరిగిన వారపు సంతలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం తగదన్నారు. పింఛన్ పెంపు ఎప్పుడు అమలు చేస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై అధికార పార్టీ నాయకులను నిలదీయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వైద్యులను నియమించాలని వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరీశంకర్ మజ్జి

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వైద్యులను నియమించాలని బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీశంకర్ మజ్జి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం రాజధాని భువనేశ్వర్‌లో లోక్ సేవా భవన్‌లో రాష్ట్ర వైద్య శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్‌ని కలిసి వినతిపత్రం అందించారు. సుమారు 16 లక్షల జనాభాకు ఆధారమైన కేంద్ర ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉందన్నారు. ముఖ్యంగా పీడియాట్రిక్, ఆర్థోపెడిక్ సర్జన్లు ఇతర ప్రాంతాలకు వైద్యం కోసం వెళ్లాల్సి వస్తోందని చెప్పారు.

కల్తీ సారాకు మరొకరు బలి

- రెండుకు చేరిన మృతుల సంఖ్య
- జెనాపూర్‌ను సందర్శించిన బీజేడీ నిజ నిర్ధారణ బృందం
- ఆర్డీసీ దర్యాప్తు చేయిస్తాం: మంత్రి



బాధితుల్ని పరామర్శించిన బీజేడీ నేత చిన్మయానంద్ శ్రీరూప్‌దేవ్



ఘటనా స్థలం సందర్శనలో బీజేడీ నిజ నిర్ధారణ బృందం

భువనేశ్వర్: గంజాం జిల్లా చికిటి మండలం జెనాపూర్ గ్రామంలో కల్తీ సారా మరో ప్రాణాన్ని బలిగొంది. లోక్‌నాథ్ బెహెరా అనే వ్యక్తి గురువారం మృతిచెందాడు. ఇప్పటికే జుర్ బెహెరా అనే వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

రంగంలోకి దిగిన బీజేడీ..

ఈ ఘటన పట్ల విపక్ష బిజూ జనతా దళ్ రంగంలోకి దిగింది. నిరంజన్ పూజారి ఆధ్వర్యంలో నిజనిర్ధారణ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు బిజూ జనతా దళ్ సీనియర్ నాయకుడు ప్రతాప్ జెనా తెలిపారు. మాజీ మంత్రి ఉషా దేవి, రమేష్ చంద్ర చ్యౌ పటా్నయక్, బిక్రమ్ పండా కమిటీ సభ్యులుగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ బృందం గురువారం ఘటనా స్థలం సందర్శించింది. నివేదిక సిద్ధం చేసి బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్‌కు సమర్పిస్తుంది. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు కాక ముందే కల్తీ మద్యం అమాయకుల ప్రాణాలను బలిగొందని ప్రతాప్ జెనా కొత్త ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ..

చికిటి బిజూ జనతా దళ్ నేత, మాజీ మంత్రి ఉషాదేవి కుమారుడు చిన్మయానంద్ శ్రీరూప్‌దేవ్ మృతుల కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. మృతుల కుటుంబానికి రూ. లక్ష ఆర్థిక సహాయం అందించి సానుభూతిని తెలిపారు. మృతులత ఆత్మకు శాంతి చేకూరాలని విపక్ష నేత నవీన్ ఆకాంక్షించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.

అధికారుల బదిలీ..

చికిటి కల్తీ సారా మృత్యు సంఘటన తర్వాత ఇద్దరు అధికారులను బదిలీ చేశారు. బరంపురం అబ్కారీ ఇన్‌స్పెక్టర్ రమేష్ చంద్ర మహంతికి కొరాపుట్, సహాయ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న కుమార్ జాలీకి ఎక్సైజ్ ఢెంకనాల్ ప్రాంతాలకు బదిలీ చేశారు. బరంపురం అబ్కారీ సూపరింటెండెంట్‌ను బుధవారం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

ఆర్డీసీ దర్యాప్తు: మంత్రి

గంజాం జిల్లా చికిటి మండలం జెనాపూర్ గ్రామంలో కల్తీ సారా మృత్యు ఘటనపై ఆర్డీసీ విచారణ జరుపుతుందని అబ్కారీ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ గురువారం ప్రకటించారు. రెండు నెలల్లో నివేదిక వస్తుందన్నారు. అక్రమ మద్యం అరికట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉద్ఘాటించారు.

నైతికతతో రాజీనామా చేయాలి: విపక్ష చీఫ్ విప్

కల్తీ సారా మత్యు సంఘటన పట్ల నైతిక కర్తవ్యంగా అబ్కారీ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ పదవికి రాజీనామా చేయాలని విపక్ష బిజూ జనతా దళ్ చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ డిమాండ్ చేశారు. ఇప్పటికే రాజీనామా చేయకుండా ఆలస్యం చేశారని మండిపడ్డారు. బీజేడీ హయాంలో ఇటువంటి సంఘటన జరిగినప్పుడు అప్పటి అబ్కారీ శాఖ మంత్రి అనంగ ఉదయ్ సింగ్ దేవ్, దివంగత కాలిందిచరణ బెహెరా తమ పదవులకు రాజీనామా చేశారని గుర్తు చేశారు. కల్తీ సారా మృత్యు సంఘటనపై దర్యాప్తు నివేదికను సభలో బహిరంగ పరచాలని కోరారు.

అబ్కారీ మంత్రి రాజీనామాకు డిమాండ్



శాసన సభలో విపక్షాల గందరగోళం

భువనేశ్వర్: మలి విడత బడ్జెట్ సమావేశాలు మూడో రోజు కూడా గందరగోళం మధ్య సాగాయి. గురువారం సభా కార్యక్రమాలు ఆరంభమైన కాసేపటికే గంజాం జిల్లా చికిటి కల్తీ సారా మృతులపై సభలో విపక్షాలు ఆందోళనకు దిగాయి. అబ్కారీ శాఖ మంత్రి రాజీనామా చేయాలని బిజూ జనతా దళ్ సభ్యులు డిమాండ్ చేశారు. మరోవైపు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులను కాంగ్రెసు సభ్యులు వ్యతిరేకించి సభలో నినాదాలు చేసి హోరెత్తించారు. బీజేడీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీవ్ర వాగ్వాదం మధ్య సభను ఉదయం 11.30 వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల వరకు స్పీకర్ సురమా పాఢి వాయిదా వేశారు.

డ్రాపౌట్లను నివారించాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా ప్రాధికరణ కార్యదర్శి బిమల్ రవుళో

పర్లాకిమిడి: డ్రాపౌట్లను గుర్తించి బడిలో చేర్పించాలని న్యాయ సేవా ప్రాధికరణ కార్యదర్శి బిమల్ రవుళో సిబ్బందికి సూచించారు. గజపతి జిల్లా న్యాయ సేవా ప్రాధికరణ అధ్యక్షుడు, జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్ ఆదేశాల మేరకు గురువారం గారబంద పంచాయతీ కార్యాలయంలో డ్రాపౌట్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాహక్కును పటిష్టంగా అమలు చేయాలన్నారు. చిన్నారులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో గుసాని సమితి బీడీఓ అజయ్‌కుమార్ ప్రధాన్, శిక్షాధికారి టి.కిషోర్ కుమార్, గారబంద సర్పంచ్ పి.అశోక్‌కుమార్, ఉపసర్పంచ్ డి.మాధురి తదితరులు పాల్గొన్నారు.

డెంగీ ప్రచార రథం సిద్ధం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పట్వారి

రాయగడ: డెంగీ వ్యాధి కట్టడికి జిల్లా యంత్రాంగం నడుం బిగించింది. వ్యాధి నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఉద్దేశించిన ప్రచార రథాన్ని గురువారం కలెక్టర్ ఫరూల్ పట్వారి జిల్లా కేంద్రం హస్పటల్ ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగీ వ్యాధి నివారణ చర్యలకు సంబంధించి జిల్లా ఆరోగ్య శాఖ సూచించే మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం హాస్పటల్‌లో పలు వార్డును కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ముఖ్య వైద్యాధికారి (ప్రజా ఆరోగ్య శాఖ) డాక్టర్ మమత సాహు, సూపరింటెండెంట్ డాక్టర్ వరదా కాంత్ మిశ్రో తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీఓ

మల్కన్‌గిరి: పోడియా సమితి కేంద్రంలో చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. కలిమెల సమితిలోని భరత్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్న చలాల్ మండాళ్, సురాజ్ సర్కార్‌లు విధి నిర్వహణలో భాగంగా ఈ నెల 16న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దోన్నపాల్ దుబతోట, పోడియా సమితిలోని ఎంవీ 66 గ్రామం , నిలిగూఢ గ్రామాల్లో రుణాలు వసూలు చేసి తిరిగి వస్తుండగా కలిమెల సమితి ఉంద్రుకొండ వంతెన వద్ద దుండగులు అడ్డుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.4లక్షల 22వేల 424 నగదు, మూడు సెల్‌ఫోన్లు, ట్యాబ్ లాక్కొని పరారయ్యారు. ఫైనాన్స్ మేనేజర్ మోహన్ సోగరియా పోడియా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్‌డీపీఓ సచీన్ పాటిల్ దర్యాప్తు చేపట్టారు. కేసులో ప్రధాన నిందితుడు కంపెనీలో పని చేస్తున్న సురాజ్ సర్కారే అని గుర్తించారు. సురాజ్‌తో పాటు ఆశిశ్ మండాల్, మరో వ్యక్తి కలిసి ఈ పథకం పన్నినట్లు గుర్తించి వారి వద్ద నుంచి రూ.4లక్షల 17 వేల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

కదంతొక్కిన గిరిజనులు



కలెక్టర్ కార్యాలయం వద్ద గిరిజనుల నిరసన

మల్కన్‌గిరి: అటవీ హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి గిరిజనులు పోటెత్తారు. 2012 నుంచి అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నా పట్టించుకోవడం లేదని, వారంలోగా సమస్య పరిష్కారం కాకపోతే రాస్తారోకో చేస్తామని గిరిజన సంఘం అధ్యక్షుడు బిశేశ్వర్ మడ్కమి హెచ్చరించారు.

కార్యక్రమంలో జయంతి బురద, చూమికి బెహరా, 111 పంచాయతీల సర్పంచ్‌లు, గిరిజనులు పాల్గొన్నారు.

15 హెక్టార్లలో కాఫీ తోటల పెంపకం



కాఫీ మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే పవిత్ర, అధికారులు

కొరాపుట్: కొరాపుట్ జిల్లాలో 15 హెక్టార్లలో కాఫీ తోటలు పెంచుతామని లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత ప్రకటించారు. గురువారం లక్ష్మీపూర్ సమితి పంచాడ పంచాయతీ నిరనిగుడ గ్రామంలో కాఫీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాఫీ సాగుకు ఇక్కడి వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. ప్రభుత్వం సైతం అనేక సదుపాయాలు కల్పించి ప్రోత్సాహం అందిస్తుందన్నారు. రైతులు కాఫీ బోర్డు అధికారులు అందించే సూచనలు పాటించాలన్నారు.

కోర్టు ఏర్పాటు చేయాలి



దీక్ష చేస్తున్న పరిషత్ ప్రతినిధులు

కొరాపుట్ : నబరంగ్‌పూర్ జిల్లా కొసాగుమ్మ సమితిలో జేఎంఎఫ్ కోర్టు ఏర్పాటు చేయాలంటూ కొసాగుమ్మ వికాస్ పరిషత్ ప్రతినిధులు గురువారం కూడా నిరవధిక నిరాహార దీక్షలు కొనసాగించారు. 2017లో ప్రభుత్వం కొసాగుమ్మలో జేఎంఎఫ్ కోర్టు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. అక్కడ భవన నిర్మాణం సైతం పూర్తి చేసింది. అయితే కొత్త ప్రభుత్వం కొడింగా పట్టణంలో కోర్టు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడంతో ప్రజాసంఘాలు ఆందోళనకు దిగాయి. ఈ నెల 14 నుంచి బ్లాక్ సమితి కేంద్రం ఎదుట శిబిరం ఏర్పాటు చేసి నిరసనలు కొనసాగిస్తున్నాయి. దీక్షల్లో హరిబందు మజ్జి, మధు సూదన్ బోత్ర, గోవర్ధన్ గౌడ పాల్గొన్నారు.

పాముకాటుతో యువతి మృతి



విలపిస్తున్న కుటుంబ సభ్యులు

మల్కన్‌గిరి : జిల్లాలోని మత్తిలి సమితి మెక్క పంచాయతీ బటగూఢ గ్రామంలో కమల సోడి (22) అనే యువతి పాముకాటుకు బలైంది. బుధవారం రాత్రి ఇంట్లో నిద్రపోతుండగా పాముకాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు బాధితురాలిని మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. విషయం తెలుసుకున్న చిత్రకొండ ఎమ్మెల్యే బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మత్తిలి పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

● గజపతి.. మట్టి గణపతి



రానున్న వినాయక చవితికి గజపతి జిల్లాలో కేవలం మట్టి గణపతి విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఉందని కలెక్టర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసే విగ్రహాలను నిషేధించినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పర్లాకిమిడిలో చిత్రకారవీధి, కటికవీధుల్లో మట్టి విగ్రహాల తయారీ ఊపందుకుంది. - పర్లాకిమిడి

జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీజేడీ హవా



నవీన్ నివాస్‌లో విజయోత్సాహం



విజేతగా నిలిచిన గుప్త ప్రసాద్ జంకర్‌తో పార్టీ జిల్లా అధ్యక్షుడు రమేష్ మజ్జి

భువనేశ్వర్: కేంద్రాపడా జిల్లా పరిషత్ అధ్యక్షురాలిగా బిజూ జనతా దళ్ (బీజేడీ) అభ్యర్థి లిలితా దాస్ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భాపూర్ పంచాయతీ సమితి చైర్‌పర్సన్‌గా బీజేడీకి చెందిన సాబిత్రి ప్రధాన్ పోటీ లేకుండా తిరిగి ఎన్నికయ్యారు. అదేవిధంగా హడొభొంగా వైస్ చైర్మన్‌గా బీజేపీకి చెందిన కన్హు చరణ్‌నాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖల్లికోట్ మండల అధ్యక్షురాలుగా బీజేపీ మద్దతుతో కుమారి దాస్ విజేతగా నిలిచారు. రాయఘడ్ మండల అధ్యక్షుడుగ బీజేడీ మద్దతు అభ్యర్థి గుప్త ప్రసాద్ ఝుంకర్ గెలుపొందారు. విద్రోహక శక్తుల ప్రభావం నివారించేందుకు బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ జిల్లా పరిషత్ సభ్యులందరితో ఇటీవల సమావేశం నిర్వహించారు. ఈ ప్రయత్నం ఫలప్రదమైంది. బీజేడీ విజేతల ఆగమనంతో నవీన్ నివాస్ గురువారం కళకళలాడింది. జిల్లా పరిషత్ అధ్యక్ష పదవి షెడ్యూల్డ్ కులం వర్గానికి చెందిన మహిళకు రిజర్వ్ చేశారు. సరైన అభ్యర్థిని బరిలో నిలపడంలో భారతీయ జనతా పార్టీ ఆదిలోనే విఫలం కావడంతో లిలితా దాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రాయిఘర్ సమితి చైర్మన్ పదవి బీజేడీ కైవసం..

కొరాపుట్ : నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి చైర్మన్ పదవి విపక్ష బీజూ జనతాదళ్ పార్టీ కైవసం చేసుకుంది. గురువారం జరిగిన ఉప ఎన్నికల్లో ఆ పార్టీ నేత గుప్తప్రసాద్ జంకర్ విజయం సాధించారు. బీజేడీకి 16 ఓట్లు, బీజేపీ ఏడు ఓట్లు రాగా, ఓ ఓటు చెల్లకుండాపోయింది. ఇదే పదవిలో ఉన్న నవీనా నాయక్ గత సార్వత్రిక ఎన్నికలలో ఉమ్మర్‌కోట్ అసెంబ్లీ స్థానంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడానికి వీలుగా రాజీనామా చేశారు. దాంతో పోటీ అనివార్యమైంది. వైస్ చైర్మన్‌గా ఉన్న గుప్త ప్రసాద్ జంకర్‌ని బీజేడీ బరిలో దింపి గెలిపించుకొంది. త్వరలో గుప్త ప్రసాద్ జంకర్ రాజీనామా చేశాక.. వైస్ చైర్మన్ పదవికి, నవీనా నాయక్ రాజీనామా చేసిన సమితి స్థానానికి ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి మూడు రోజులుగా రాయిఘర్‌లో మకాం వేశారు. గెలుపు ప్రకటన వెలువడిన అనంతరం గుప్త జంకర్, రమేష్ మజ్జి తదితరులు రాయిఘర్ వీధులలో భారీ ఊరేగింపు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత డీలాపడ్డ బీజేడి శ్రేణులకు ఈ ఎన్నిక ఉపశమనం ఇచ్చింది.

'సిమ్‌బాక్స్' సూత్రధారి కోసం వేట



వివరాలు వెల్లడిస్తున్న సంజీవ్ పండా



నిందితుడు అసదుర్ జమాన్

భువనేశ్వర్: సిమ్ బాక్స్ సిండికేట్ వ్యవహారంలో పట్టుబడిన రాజు మండల్ రిమాండ్ గురువారంతో పూర్తయ్యింది. ఐదు రోజుల రిమాండ్‌లో కమిషనరేట్ పోలీసులకు పలు కీలక సమాచారం అందింది. నిందితుడిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఇద్దరు సభ్యుల బందం విచారించింది. ఈ కేసులో సూత్రధారి అసదుర్ జమాన్ ఫొటోను కమిషనరేట్ పోలీసులు విడుదల చేశారు. ఫైల్ ఫొటో ఆధారంగా అసదుర్ జమాన్‌ను త్వరలో అరెస్టు చేయడానికి సీబీఐ ఇంటర్‌పోల్ సహాయం తీసుకోనుంది.

- జమాన్ బంగ్లాదేశ్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌ను నడుపుతున్నాడు. ఢాకాలో ఉంటూనే భువనేశ్వర్, రాంచీ సిమ్ బాక్స్ సెటప్ నిర్వహిస్తున్నాడు. ఈ రెండు ప్రాంతాలకు వెళ్లకపోయినా స్మార్ట్ స్విచ్‌ల ద్వారా నెట్‌వర్క్ మొత్తాన్ని కంట్రోల్ చేస్తున్నాడు. అసదుర్ జమాన్ ఢాకాలోని ఫ్యాషన్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో చదువుకున్నట్లు గుర్తించారు.
- మరోవైపు రాజు మండల్‌కు ఉగ్రవాద లింకు గురించి సమాచారం అందింది. విదేశాల్లో ఉంటున్న అండర్ వరల్డ్ డాన్‌ను కూడా ఈ సిమ్‌బాక్స్ నుంచి పిలిపించారు. కొన్ని యాక్టివ్ సిమ్‌ల నివేదికను కూడా కమిషనరేట్ పోలీసులు అతి త్వరలో తీసుకోనున్నారు. బంగ్లాదేశ్‌తో పాటు పాకిస్థాన్, చైనాలకు కాల్స్ చేసిన ఆధారాలు కూడా గుర్తించారు. రాజు రిమాండ్ ముగియడంతో 7 రోజుల రిమాండ్ కోసం కోర్టులో దరఖాస్తు చేయనున్నట్లు భువనేశ్వర్ – కటక్ జంట నగరాల పోలీస్ కమిషనర్ సంజీవ్ పండా తెలిపారు.

ముండిపుట్‌లో డయేరియా



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి బాగ్‌దెరి పంచాయతీ ముండిపుట్ గ్రామంలో అతిసార ప్రబలింది. పది రోజులుగా పలువురు గ్రామస్తులు వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నారు. ఇప్పటికే ఓ వ్యక్తి మృతి చెందగా మరో ఎనిమిది మంది కుంద్ర కమ్యూనిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి ప్రత్యేక వైద్య బృందాన్ని పంపించినట్లు వైద్యాధికారి డాక్టర్ గణేష్ ప్రసాద్‌దాస్ తెలిపారు. ఈ సీజన్‌లో స్థానికులు పుట్టగొడుగు, వెదురు కంజ తదితర అటవీ ఉత్పత్తులు తింటారని, అందుకే వాంతులు విరోచనాలు సంభవిస్తాయని చెప్పారు.

విశాఖలో రోడ్డు ప్రమాదం

● నబరంగ్‌పూర్ వాసి మృతి



గోరంట కాళీ

కొరాపుట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నబరంగ్‌పూర్ వాసి మృతిచెందాడు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని చైనా మార్కెట్‌లో క్లాసీ సెలూన్ యజమాని గోరంట కాళీ (55) రాఖీ పండగ రోజు విశాఖ వెళ్లాడు. అక్కడ రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో కోమాలోకి వెళ్లిపోయాడు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈయన మృతిపట్ల సెలూన్ నిర్వాహకులు సంతాపం తెలియజేశారు.

పర్లాకిమిడిలో మెగాస్టార్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అభిమానులు

పర్లాకిమిడి: మెగాస్టార్ చిరంజీవి 68వ జన్మదిన వేడుకలు పర్లాకిమిడిలో గురువారం ఘనంగా నిర్వహించారు. మెగా అభిమానుల సంఘం ఆధ్వర్యంలో జంగం వీధి జంక్షన్ వద్ద కేక్ కట్ చేశారు. రాసూరులో జగన్నాథనికేతన్ అనాథాశ్రమంలో చిన్నారులకు అల్పాహారం, మిఠాయిలు పంచిపెట్టారు.

కార్యక్రమంలో అలిజింగి రాము, శంకర్, శ్యాం, ధర్మారావు, చందన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాస్త పెరిగిన తోటపల్లి నీటిప్రవాహం


తోటపల్లి ప్రాజెక్టువద్ద పరిస్థితి

గరుగుబిల్లి: అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టువద్ద నీటిప్రవాహం కాస్త పెరిగింది. నాగావళినదిలో తోటపల్లి ప్రాజెక్టువద్ద గురువారం సాయంత్రానికి 105 మీటర్ల లెవెల్‌కుగాను 104.52 మీటర్ల లెవెల్‌లో నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం నదిపై భాగం నుంచి ప్రాజెక్టుకు 2,650 క్యూసెక్కుల వరద నీరు రాగా అధికారులు రెండు గేట్లు ఎత్తివేసి 1,929 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. అలాగే కాలువలద్వారా 3,019 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టు నీటిసామర్థ్యం 2.5 టీఎంసీలకుగాను 2.213 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టువద్ద నీటిపరిస్థితిని ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

కూలిన పూరిల్లు


కూలిపోయిన పూరింటి వద్ద ఆర్ఐ లక్ష్మనాయుడు, ఎంపీటీసీ వెంకటనాయుడు, బాధితులు

వీరఘట్టం: మండలవ్యాప్తంగా బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులు, పిడుగులతో భారీ వర్షం కురిసింది.ఈ వర్షం ధాటికి చలివేంద్రి గ్రామానికి చెందిన పోరెడ్డి సుబ్బారావు పూరిల్లు అర్ధరాత్రి కుప్పకూలిపోయింది. ఆ ఇంటిలో భార్య, ఇద్దరు పిల్లలతో సుబ్బారావు ఉంటున్నాడు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి వారంతా భయపడి సమీపంలో ఉన్న బంధువుల ఇంటిలో పడుకునేందుకు వెళ్లారు. తెల్లవారాక ఇంటికి వచ్చి చూసేసరికి ఇల్లు మొత్తం కుప్పకూలిపోయింది. దీంతో పెద్దప్రమాదం నుంచి బయటపడ్డామంటూ సుబ్బారావు కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంపై ఎంపీటీసీ పోరెడ్డి వెంకటనాయుడు ఇచ్చిన సమాచారం మేరకు ఆర్ఐ ఎన్.లక్ష్మనాయుడు, వీఆర్ఓ చక్రధర్ వచ్చి జరిగిన ప్రమాదాన్ని పరిశీలించారు. సుమారు రూ.50 వేల ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా వేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

సెప్టెంబర్‌లో జిల్లాస్థాయి యువజనోత్సవాలు

పార్వతీపురంటౌన్: రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు (సాంస్కృతిక పోటీలు) వచ్చే సెప్టెంబర్ నెలలో నిర్వహించనున్నట్లు సెట్విజ్ సీఈఓ బి. రామగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల యువతీ యువకులు (15–29 వయస్సు) సంబంధిత పోటీల్లో పాల్గొనేందుకు తగిన శిక్షణతో సన్నద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. పోటీలు తేమిటిక్ థీమ్, ఇన్నోవేషన్ ఇన్ సైన్స్, సైన్స్ టెక్నాలజీ అంశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాంస్కృతిక విభాగంలో జానపద నృత్యాలు (బృందం), జానపద గీతాలు (బృందం), జానపద నృత్యాలు (సోలో), జానపద గీతాలు (సోలో) పోటీలు ఉంటాయన్నారు. జీవిత నైపుణ్య విభాగంలో కవిత్వం, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, డిక్లరేషన్ (ప్రకటన). పోటీలు నిర్వహిస్తామన్నారు. యువ కృతి విభాగంలో హస్తకళలు, చేనేత వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీలలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో, రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు జాతీయస్థాయి యువజనోత్సవాలలో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9849913080 లేదా 8247554334 నంబర్లను కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

నేడు మంత్రి సత్యకుమార్ యాదవ్ రాక

విజయగరం అర్బన్: రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం ఉమ్మడి విజయనగరం జిల్లాకు రానున్నారు. వేకువజామున 4.20 గంటలకు రైలులో నగరానికి చేరుకుంటారు. ఉదయం 8.30 గంటలకు పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం బయలుదేరి వెళతారు.

నేడు రామతీర్థంలో సామూహిక కుంకుమార్చన

నెల్లిమర్ల రూరల్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి దేవస్థాన అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరుకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం శ్రీరామ, లక్ష్మీ అష్టోత్తర పూజలు, కుంకుమార్చనలు నిర్వహిస్తారు. 11.30 గంటలకు శ్రీరామచంద్ర పట్టాభిషేకాన్ని జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తారు. పూజా కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు ఆలయ సిబ్బందే పూజా ద్రవ్యాలను అందజేస్తారు. కుంకుమార్చనల నేపథ్యంలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని మట్టి గాజులతో సుందరంగా ముస్తాబు చేశారు.

అంతులేని విషాదం

- మృతుల స్వగ్రామాల్లో విషాదఛాయలు


భార్య సత్యవతితో ఆనందరావు(ఫైల్)


గొల్లపేటలో విషణ్ణవదనాల్లో మృతుడి బంధువులు


మహంతి నారాయణరావు అలియాస్ సంతు


అర్తమూరులో మృతుడి ఇంటి వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

పూసపాటిరేగ/చీపురుపల్లిరూరల్ (గరివిడి): అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా పరిశ్రమలో బుధవారం జరిగిన దుర్ఘటనలో గరివిడి మండలంలోని అర్తమూరు గ్రామానికి చెందిన మహంతి నారాయణరావు(34), పూసపాటిరేగ మండలంలోని గొల్లపేటకు చెందిన బమ్మిడి ఆనందరావు (38) ప్రాణాలు విడవడంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆ కుటుంబాల్లో ఉన్నతంగా చదువుకున్న వారు ఉద్యోగాలు చేస్తూ కుటుంబానికి పెద్దదిక్కుగా ఉండి నడిపించేవారని, కుటుంబసభ్యులు, బంధువులు రోదిస్తున్న తీరు అందరి హృదయాలను కలిచివేసింది. ఎంఎస్సీ చదువుకున్న మహంతి నారాయణరావు 2020వ సంవత్సరంలో ఫార్మా కంపెనీలో ఉద్యోగం సంపాదించి అనతికాలంలోనే అదే కంపెనీలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగాడు. తల్లిదండ్రులు మహంతి సత్యం, బంగారమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు కాగా మృతుడు నారాయణరావు చిన్నవాడు. మృతుడికి భార్య స్వాతి, రెండేళ్ల వయస్సు గల కుమారుడు అనిషిత్ ఉన్నారు. కొడుకు మరణంతో తల్లిదండ్రులు, భర్త మరణంతో స్వాతి, కుమారుడు అనాథలుగా మిగిలారు. అలాగే విశాఖపట్నంలోని కూర్మన్నపాలెంలో నివసిస్తూ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న ఆనందరావు రాఖీ పండగరోజు గ్రామానికి వచ్చి అందరినీ కలిసి వెళ్లాడని గొల్లపేట గ్రామస్తులు వాపోయారు. ఇంతలో పేలుడు రూపంలో మృత్యువు కాటేసిందని భోరున విలపించారు. మృతుడికి భార్య సత్యవతి, కుమారులు కౌశిక్, మనోజ్, అన్నయ్య బమ్మిడి పోతయ్య ఉన్నారు.

సోంపురం వ్యక్తికి గాయాలు

వేపాడ: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో వేపాడ మండలంలోని సోంపురం గ్రామానికి చెందిన జాగరపు ప్రకాశ్ గాయాలపాయ్యాడు. జాగరపు ప్రకాశ్ కొంతకాలంగా కంపెనీలో పనిచేస్తున్నాడు. అయితే బుధవారం ఫార్మాలో జరిగిన ప్రమాదంలో ప్రకాశ్ ముఖం, చేతులపై గాయాలయ్యాని బాధితుడి కుటుంబసభ్యులు తెలిపారు. ప్రస్తుతం అచ్యుతాపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. ప్రకాశ్ భార్య మానస, తల్లి లక్ష్మి, తండ్రి రాము ఉన్నారు.


వేపాడ: గాయాలపాలైన ప్రకాశ్

పెళ్లి బాజాలు మోగాల్సిన ఇంట..


పార్థసారథి (ఫైల్)

పార్వతీపురం టౌన్: మరి కొద్దిరోజుల్లో ఆ ఇంట పెళ్లి బాజాలు మోగాల్సి ఉంది. ఇప్పటికే బంధువర్గాలకు పిలుపులు, పెళ్లికి కావాల్సిన సరంజామా సమకూర్చుకోవడంలో వధూవరుల కుటుంబాలు నిమగ్నమయ్యాయి. ఇంతలోనే విధికి కన్నుకుట్టింది. త్వరలో పెళ్లి కొడుకు కావాల్సిన పార్వతీపురం మండలం డోకిశీల పంచాయతీ చలమవలస గ్రామానికి చెందిన జవ్వాది కోటేశ్వరరావు కుమారుడు పార్థసారథి(26) అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఈ వార్త తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న కుమారుడు మృతి చెందడంతో కుటుంబసభ్యులు కంటికీమింటికీ ఏకధారగా రోదించారు. సెప్టెంబరు 4న పార్థసారథి వివాహాన్ని కుటుంబసభ్యులు నిశ్చయించారు. పార్థసారథి మృతితో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుంటుబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన జవ్వాది పార్థసారథి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సాయం అందించేలా చర్యలు చేపడతామని చెప్పారు. పరామర్శలో ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీ బాధితులకు అండగా ఉంటాం

- మృతుల కుటుంబాలకు ప్రగాడ సానుభూతి
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు

చీపురుపల్లి/చీపురుపల్లిరూరల్(గరివిడి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో బుధవారం రియాక్టర్ పేలిన దుర్ఘటన చాలా దురదృష్టకరమైందని, ఆ ప్రమాద బాధితులకు తాము అండగా ఉంటామని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన 17 మందిలో విజయనగరం జిల్లాకు చెందిన ఇద్దరు, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఒకరు దుర్మరణం చెందారని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాల పట్ల ఉదారంగా స్పందించాలని కోరారు. విశాఖలో ఎల్‌జీ పాలిమర్స్ దుర్ఘటన సమయంలో నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ఉదారంగా స్పందించిన విధానం బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చిందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక్కో కుటుంబానికి రూ.కోటి చొప్పున నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం గొప్ప విషయమని, మిగిలిన బాధిత కుటుంబాలకు వైద్యం ఇతరత్రా సదుపాయాలు కల్పించారని గుర్తుచేశారు. ఆ మాదిరిగానే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా స్పందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నానన్నారు. ఎసెన్షియా దుర్ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే డిమాండ్ చేశారని, ఆ మేరకు ఈరోజు చంద్రబాబు ప్రభుత్వం ఆదుకుంటామని ప్రకటించిందన్నారు. బాధిత కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఇండోర్ స్టేడియం సిద్ధం చేయాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: స్థానిక విజ్జీ స్టేడియంలో సీపీడబ్ల్యూ పథకం కింద సుమారు రూ.6 కోట్లతో నిర్మించిన బహుళ ప్రయోజన ఇండోర్ స్టేడియంను త్వరగా సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ ఆదేశించారు. ఈ మేరకు ఇండోర్ స్టేడియం నిర్మాణంపై కలెక్టర్ తన చాంబర్‌లో గురువారం సమీక్షించారు. దీని నిర్మాణం దాదాపు పూర్తయిందని, సుమారు రూ.10 లక్షలతో చిన్న చిన్న మరమ్మతులు పూర్తి చేయాల్సి ఉందని డీఎస్‌డీఓ వెంకటేశ్వర్రావు కలెక్టర్ తెలిపారు. మరమ్మతులకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని అమ్మవారి పండగ నాటికి స్టేడియాన్ని సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.20 లక్షల బిల్లుల మంజూరు కోసం శాప్‌కు రాయాలని సూచించారు. స్టేడియం వద్ద వెంటనే బోరు తివ్వించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించాలని విద్యుత్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వర్రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఉమాశంకర్, సీపీడబ్ల్యూ జేఈ శ్రీనివాసరావు, ఇతర ఇబ్బంది పాల్గొన్నారు.

మానాపురం వంతెన ఐదు నెలల్లో పూర్తికావాలి

జిల్లాలోని దత్తిరాజేరు మండలం మానాపురం రైల్వే గేటు వద్ద రాయ్‌పూర్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణం వచ్చే జనవరి నెలాఖరు నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తికావాలని కలెక్టర్ ఆదేశించారు. వంతెన నిర్మాణం పురోగతిపై ఇకపై ప్రతి నెలా నిర్మాణ సంస్థతోను, జాతీయ రహదారుల సంస్థ ఇంజినీర్లతోను సమీక్ష నిర్వహిస్తామన్నారు. నిర్మాణ సంస్థ హామీ ఇచ్చిన విధంగా వచ్చే జనవరి నాటికి పనులు పూర్తికానట్లయితే సంస్థను బ్లాక్ లిస్టులో ఉంచాలని ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో కన్సల్టెంట్ సంస్థ టీమ్ లీడర్ బాపన్న శెట్టి, జాతీయ రహదారుల సంస్థ ఈఈ శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ బాలకృష్ణ, డీఈ కేవీ నరసింహారావు, ఏఈ మురళీబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం

- జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్


పార్వతీపురం: ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మండల వ్యవసాయ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థకు సంయుక్తంగా నిర్వహించిన జిల్లాస్థాయి వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల లాభాలు, సాగు విధానాలు, నవధాన్యాల సాగు వల్ల ఉపయోగాలు తదితర అంశాలపై వర్క్‌షాప్‌లో చర్చించారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్‌లో మాట్లాడుతూ రైతులను సంపన్నులుగా మార్చడమే లక్ష్యంగా వ్యవసాయ విధానాలు రూపొందించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో ఖర్చు, రాబడి వివరాలు నమోదుచేసేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయం విస్తీర్ణం పెంచాలని, ప్రతి రైతు సేవాకేంద్రాల పరిధిలో కనీసం ఒక ఎకరా భూమిలో ప్రకృతి వ్యవసాయం ప్రారంభించేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో పార్వతీపురం ఏడీఏ టి.వెంకటేష్, కె.శ్రీనివాస్, డి.భరత్, పాలకొండ ఏడీఏ కె. రత్నకుమారి, సాలూరు ఏడీఏ ఎం.మధుసూదన్, గుమ్మలక్ష్మీపురం ఏడీఏ నిర్మలాజ్యోతి, మండల వ్యవసాయ అధికారులు, కమ్యూనిటీ సహజ వ్యవసాయాన్ని నిర్వహించే సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



బొబ్బిలి: పట్టణంలోని కంచరవీధికి చెందిన పిల్లేన దుర్గాప్రసాద్(17) విద్యుత్ షాక్‌తో గురువారం మృతిచెందాడు. ఈ సంఘటనపై సీఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం దుర్గాప్రసాద్ ఉదయం బాత్‌రూమ్‌కు వెళ్తూ అక్కడ ఉన్న ఇనుపరాడ్‌ను పట్టుకోగా షాక్‌కొట్టడంతో కేకలు వేశాడు. దీంతో తండ్రి గంగరాజు వచ్చి కర్రతో కొట్టి రాడ్డునుంచి దుర్గాప్రసాద్‌ను వేరుచేశాడు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న కుమారుడిని తల్లిదండ్రులు స్థానిక పీహెచ్‌సీకి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బేబినాయన మృతదేహాన్ని చూసి, ఆ కుటుంబాన్ని ఓదార్చారు.

బలిజిపేటలో వరొకరు..



పార్వతీపురంటౌన్/బలిజిపేట: బలిజిపేట మండలంలోని మిర్తివలస గ్రామ సమీపంలో బుధవారం రాత్రి విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలంలోని గాజుల వలస గ్రామానికి చెందిన ఎస్.శంకర్రావు (21) విద్యుత్ పనులు చేస్తుండగా నడిమింటి వారి చెరువు వద్ద ఎలక్ట్రికల్ పోల్‌కు విద్యుత్ సరఫరా అవడంతో షాక్ కొట్టి మృతి చెందాడు. దీనిపై ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. గురువారం ఉదయాన్నే పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ..

బొబ్బిలిరూరల్: మండలంలోని విజయపురిగ్రామానికి చెందిన జిన్ని గౌరమ్మ(45) పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ విషయమై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గౌరమ్మ ఈనెల 17న భర్తతో గొడవపడి రాత్రి 11గంటల సమయంలో మనస్తాపంతో పురుగు మందు తాగేసింది. విషయం తెలుసుకున్న భర్త ఆమెను బొబ్బిలి సీహెచ్‌సీలో చేర్పించగా ప్రాథమిక చికిత్స అనంతరం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి వైద్యులు రిఫర్‌చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె బుధవారం మృతి చెందిందని సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

పట్టపగలే గ్రావెల్ అక్రమ తవ్వకాలు

- మెయిన్‌రోడ్డు మీదుగానే ట్రాక్టర్ల రాకపోకలు
- సమాచారం ఇచ్చినా పట్టించుకోని అధికారులు


ట్రాక్టర్‌లోకి కంకరను లోడ్‌చేస్తున్న జేసీబీ

బొబ్బిలిరూరల్: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో గ్రావెల్, ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. శని, ఆదివారాల్లో రాత్రిపూట జరిగే ఈ తంతు ఇప్పుడు తొండముదిరి ఊసరవెల్లి అయినట్టుగా పట్టపగలే అధికారపార్టీ అండదండలతో తవ్వకాలు జరుపుతున్నారు. బొబ్బిలి ఆర్డీఓ కార్యాలయానికి కూతవేటు దూరంలో గత రెండు రోజులుగా తవ్వకాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. మెట్టవలస గ్రామ సమీపంలోను, గ్రోత్ సెంటర్‌కు చివరన రాళ్లక్వారీ ఉంది. దీనిని ఇప్పటికే తొలిచేశారు. ఇప్పుడు అక్కడున్న కంకరను తవ్వేస్తున్నారు. గురువారం ఉదయం నుంచి గ్రావెల్ తవ్వకాలను మొదలుపెట్టారు. 6 ట్రాక్టర్లు, ఒక జేసీబీ సాయంతో మట్టితవ్వి తరలించేస్తున్నారు. లోడు దాదాపు రూ.1500కు విక్రయిస్తున్నారు. దీనిపై స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు చూసొచ్చి తవ్వకాలకు అనుమతులున్నాయని చెప్పొకొచ్చారు. క్వారీలో రాయి తవ్వకానికి అనుమతిచ్చారే తప్ప, ఆ చుట్టుపక్కల ఉన్న కంకరను తవ్వేందుకు అనుమతులెవరిచ్చారని ప్రశ్నిస్తే మాట మార్చుతున్నారు. అక్రమగ్రావెల్ తవ్వకాలకు అధికారపార్టీ వారికి రెవెన్యూ అధికారులే అక్రమంగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారేమో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూగర్భగనుల శాఖ ఎవరికి, ఎలాంటి అనుమతిలిచ్చిందో ఉన్నతాధికారులు తేల్చాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

బాల్య వివాహం అడ్డగింత


గ్రామంలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

వంగర: మండల పరిధి అరసాడలో బాల్యవివాహాన్ని అధికారులు గురువారం అడ్డుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం యరకరాయపురం గ్రామానికి చెందిన బాలికకు అరసాడ గ్రామానికి చెందిన యువకుడితో వివాహం చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో స్థానికులు అధికారులకు సమాచారం అందించడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్.సన్యాసమ్మ, హెడ్‌కానిస్టేబుల్ వావిలపల్లి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి వేణు, వీఆర్‌వో ఈశ్వరరావులు వివాహం జరిగే స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి వివాహం నిలుపుదల చేశారు. ఇరుపక్షాల తల్లిదండ్రులకు వంగర పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై షేక్ శంకర్ కౌన్సెలింగ్ ఇచ్చి బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని అవగాహన కల్పించారు. వివాహం చేయబోమని వధూవరుల తల్లిదండ్రుల నుంచి అంగీకార పత్రాలు తీసుకున్నారు.

అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మాట్లాడుతూ ప్రజలకు తక్కువ ధరకు సకాలంలో ఇసుకను వేగవంతంగా అందించేందుకు ప్రభుత్వ పరంగా అవసరమైన చర్యలను చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక సరఫరా పథకంలో అవసరమైన వారికి సరఫరా చేయనున్నామన్నారు. జిల్లాలోని భామిని మండలంలో కాట్రగడ్డ ఇసుక ర్యాంపు నుంచి ఇసుక తీసేందుకు అవసరమైన అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. ఇసుక తీసేందుకు చార్జీలు, రవాణా చార్జీలు మాత్రమే వసూలు చేసి ఇసుక అందించనున్నారని చెప్పారు.

25న లక్‌పతి దీదీ

ఈనెల 25న డ్వాక్రా మహిళా సంఘాలకు లక్‌పతి దీదీ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పీఎం నరేంద్ర మోదీ మధ్యప్రదేశ్‌లో ప్రారంభించే ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని మండలాల్లో ఎంపిక చేసిన డ్వాక్రా మహిళలకు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 406 ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.56కోట్లు చెక్కుల రూపంలో అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఇన్‌చార్జ్ డీఆర్ఓ జి.కేశవనాయుడు, ఆర్డీఓలు కె.హేమలత, వీవీ రమణ, డీపీఓ బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు గ్రామసభలు

- నేడు అన్ని పంచాయతీల్లో నిర్వహణ
- 2025–26లో చేపట్టే పనులపై నిర్ణయం

విజయనగరం ఫోర్ట్: వలసలు నివారించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొన్నేళ్లుగా దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారు. ఈ పథకం అమల్లోకి రాకముందు ఉపాధి కోసం గ్రామీణ ప్రాంత ప్రజలు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వలస వెళ్లేవారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంత ప్రజల వలసలను తగ్గించేందుకు ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద సొంత గ్రామంలోనే పనులు కల్పిస్తారు. ఉపాధి పనులు గుర్తించేందుకు గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తారు. గతంలో గ్రామసభలు రోజుకో గ్రామంలో జరిగేవి. ఈసారి జిల్లా వ్యాప్తంగా ఒకే రోజున అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహిస్తారు. ఏయే రకం పనులు ఎక్కడెక్కడ నిర్వహించాల్సి ఉంటుందని అంచనా వేసి పంచాయతీల్లో తీర్మానం చేసి మండల పరిషత్‌కు పంపిస్తారు. అక్కడ అమోదం పొందిన తర్వాత జిల్లా పరిషత్‌కు పంపిస్తారు. అక్కడినుంచి కలెక్టర్‌కు అడ్మిన్ అప్రూవల్ కోసం పంపిస్తారు.

ఒకేరోజున గ్రామసభలు

ఈఏడాది అన్ని గ్రామ పంచాయతీల్లో ఒకే రోజున గ్రామ సభలు నిర్వహించనున్నాం. గ్రామసభల్లో ఆయా పంచాయతీల్లో చేపట్టే పనులను గుర్తించనున్నాం.

అరుణశ్రీ, ఇన్‌చార్జి పీడీ, డ్వామా

ఓవరాల్ చాంపియన్ కోరుకొండ సైనిక్ స్కూల్


విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో సైనిక్‌స్కూల్ ప్రిన్సిపాల్ శాస్త్రి

- ముగిసిన సైనిక్ స్కూల్స్ ఇంటర్ గ్రూప్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్
- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.శాస్త్రి

విజయనగరం: ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ నేషనల్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌లో పాల్గొనబోయే గ్రూప్–ఎఫ్ జోన్‌కు సంబంధించిన ఇంటర్ గ్రూప్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. కోరుకొండ సైనిక్ స్కూల్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో ఇక్కడి విద్యార్థులతో పాటు అంబికాపూర్, భువనేశ్వర్, సంబల్‌పూర్ సైనిక్ స్కూల్‌కు చెందిన 200 మంది విద్యార్థులు తలపడ్డారు. అన్ని విభాగాల్లోనూ రాణించిన కోరుకొండ సైనిక్ స్కూల్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. విజేతలకు స్కూల్ ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి గురువారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునేందుకు క్రీడలు దోహదపడతాయని తెలిపారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. త్వరలో జరగబోయే ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌లో ఉత్తమ ప్రతిభాపాటవాలు కనబరిచి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. అంతకు ముందు ముగింపు కార్యక్రమంలో నిర్వహించిన మార్చ్‌పాస్ట్‌లో విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో వైస్ పిన్సిపాల్/ వింగ్ కమాండర్ వి.కిరణ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్/ లెఫ్టినెంట్ కమాండర్ అభిలాష్ బాలచంద్రన్, పాఠశాల సిబ్బంది, క్యాడెట్లు పాల్గొన్నారు.